# నీలి నీడలు

"పోస్ట్ సార్!"

తపోభంగమయింది.

కల్పనా ప్రపంచం కరిగిపోయింది.

చదువుతూన్న పుస్తకం టేబుల్ మీద పెట్టి తల పక్కకు తిప్పాను. పోస్‌మాన్ రెండు కార్డులు, ఒక ఇన్‌లాండు లెటరు, ఒక రిజిష్టరుకవరు నా చేతికిచ్చి—నా మొహం వంక చూస్తూ నివ్వెరపోయాడు; నిశ్చేష్టితుడయాడు! అతన్ని చూసి నేను మరీ కొయ్యబారిపోయాను.

అంతలో—చెంపమీదుగా మెల్లగా జారిన కన్నీటిబొట్టొకటి చేతిలో ఉన్న కార్డుమీదపడి 'టప్పు' మంది.

అతని మొహంలో మబ్బులు తారాడినాయి.

పెదిమలు కొద్దిగా చలించి సర్దుకున్నాయి.

మనిషి సానుభూతితో నిలువెల్లా నీరయినాడు.

సిగ్గుతో చచ్చిపోయాను నేను.

మనసు ముకుళించుకుపోయింది.

హృదయ దౌర్బల్యానికి నన్ను నేనే నిందించుకున్నాను.

కొండముది హనుమంతరావు

నవలలోని విషాదఘటనకే—అది కేవలం కల్పన అని తెలిసీ—హృదయం బావురుమంటుంది. ఆపుకోలేని దుఃఖం ముంచుకు వస్తుంది. హాస్యమప్పుడూ అంతే! చదువుతున్న కొద్దీ నవ్వు అలలు అలలుగా ఉబికి వస్తుంది. నాగరికత కోసమయినా ఈ కావ్యరసాలకు అతీతంగా ఉండాలని ప్రయత్నిస్తాను. నేనెంత ప్రయత్నించేస్తానో—అంతఎక్కువగా ఓడిపోతాను.

కొందరు మిత్రులు నరాలబలహీనత అన్నారు—తలవూపాను.

మరికొందరు 'నీది మెత్తనిహృదయం' అన్నారు—తలవంచాను.

కన్నీళ్ళు తుడుచుకుని, పోస్ట్‌మాన్ ముఖంలోకి చూశాను. రంగులు మార్చుకుంది. నా హృదయం తేలికపడింది.

ఆర్. ఎల్. రసీదుమీద సంతకంచేసి ఇచ్చాను. అతను వెళ్ళిపోయాడు. ఉత్తరాలు చూసుకున్నాను.

ఒకటీ ఒక స్నేహితుడినుంచి — గత వారంలో ప్రచురింపబడిన నా కథగురించి, పూర్తిగా పాడుచేశావని.

మరొకటి ఒక పాఠకుడినుంచి—అతనితో పరిచయం ఇదేమొదలు—బండబారిన అతనిహృదయాన్ని ఆకథ కదిలించివేసిందట.

రిజిష్టరు కవరు చించాను—ఈ మధ్యలో రేడియోలో ప్రసారమయిన నాటకపు రెమ్యూనరేషన్‌గా పాతిక రూపాయల చెక్కు.

అంతలో—కళ్ళు ఇన్‌లాండు లెటరు అడ్రసుమీదికి పోయినయ్. ఆ అక్షరాలు వాటికి చిరపరిచితం.

మనసులో కోటిమల్లెలు హసించినయ్!

హృదయంలో తేనెవాకలు ప్రవహించినయ్.

మనసు ఎనలేని ఆనందంతో పసిడి రెక్కలు విప్పుకుంది.

హృదయం పట్టలేని సంతోషంతో పట్టుశాలువా కప్పుకుంది.

ఎట్టఎదుట సంధ్య కళ్ళకు కట్టింది.

సిగ్గుల పెళ్ళికూతురయింది.

సింగారం రాసిపోసినట్లుంది.

కుడి మోకాలు మీద గడ్డమానించి కూర్చుంది.

బుగ్గన నల్లని కాటుకబొట్టు మిలమిలలాడుతున్నది.

ముఖాన కల్యాణతిలకం కలకలలాడుతున్నది.

కపోలాలలోని గులాబీగుత్తులు గుబాళిస్తున్నాయి.

పెదవుల్లోని కెంపులు తమలో తమ నీడల్ని చూసుకుంటున్నాయి.

కళ్ళలోని కాంతులు ఏవో గుసగుసమంటున్నాయి.




ఊహాలోకం పారిజాతంలా పరిమళించింది.

దివ్యానుభూతితో మనసు పరవశించింది...

"ఎక్కడనుంచి అన్నయ్యా ఉత్తరం?" —రాధ అడిగింది.

"సంధ్యనుంచి."

"వదినా అన్నయ్యా?!" ఆశ్చర్యపోయింది రాధ.

నాలిక కర్చుకున్నాను.

ఎంత చదువుకుంటున్నా, మేనత్త మేనమామల బిడ్డలయినా, వారం రోజుల్లో కాబోయే భర్తకు ఉత్తరం వ్రాయడం విడ్డూరం కాదూ?

"కాదు. కాదు. ఒక ఫ్రెండునుంచిలే!" మాటలు తడబడ్డాయి

అల్మారాలోని పుస్తకమేదో తీసుకొని రాధ వెళ్ళింది—చిన్నగా నవ్వుకుంటూ.

కవరు చించాను.

"భాస్కరం బావకు..."

నాల్గురోజులనుంచి ఉత్తరం రాయాలనుకుంటున్నాను. మనసులో తీవ్రమయిన యుద్ధం సాగుతున్నది—రాద్దామా? వద్దా? —అని. రాయకపోవడం దౌర్బల్యం కాని అది నా మతానికే విరుద్ధం. అందుకని వ్రాయడానికే నిశ్చయించుకున్నాను. నీ దగ్గిర దాయడమెందుకు? నిజం నిప్పువంటిది...

ఎలాగో ఇవ్వాళ మనసు రాయిచేసుకుని ఈ ఉత్తరం-మన జీవితాల్లో గొప్ప మలుపు సాధించే ఈ ఉత్తరం-ప్రారంభించేసరికి విశాల, విమల, సుందరి, సావిత్రి, సరోజిని, అందరూ వచ్చి మ్యాట్నీకి పోదామని కూర్చున్నారు. నేనెంత చెప్పినా వినేటట్లు లేరు. రేపు ఆదివారమేగా. కావాల్సినంత తీరిక. వివరంగా విపులంగా వ్రాసి ఎల్లుండి పోస్ట్ చేస్తాను. నీకు మంగళవారం చేరుతుంది.

ఆవేశానికి, ఉద్రేకానికి లోనుగాకుండా వాటికీ, నీకూ చాలా దూరమనుకో. బుద్ధుడికీ నీకూ అట్టే భేదంలేదని అప్పుడప్పుడు మానాన్న అనటంకూడా కద్దు-సావకాశంగా ఆలోచించి వెంటనే జవాబు వ్రాస్తావని ఆశిస్తాను. తుదిఘడియల్లో సాహసించిన యీ అబలను క్షమించగలవనుకొంటాను - ఉదార హృదయంతో.

ఇట్లు,
సంధ్య

[29-3-'58]

ఏమిటో ఉత్తరం అర్థం?

తల తిరిగిపోయింది; కల విరిగిపోయింది.

తటుకోలేక మనసు కూలబడిపోయింది.

అయోమయమైన హృదయం తల్లడిల్లింది.

కుందనపు బొమ్మలా కూర్చున్న సంధ్యపై నీలినీడలు పరుచుకున్నాయి. సంధ్య చుటూ ఏవో దటమయిన తెరలు దించుకున్నాయి.

ఆ ఉత్తరంలోని ఒక్కొక్క అక్షరం నా మీదకు గురిపెట్టిన ఒక్కొక్క బాణంలాగా ఉన్నది. గురిపెటిన వ్యక్తి ఎవరు?-సంధ్యా? సంధ్యే కావచ్చు. కాని అందుకు వెనుక ఎవరిదో తగినంత ప్రోత్సాహం ఉండి ఉండాలి.

సంధ్య మరెవరినయినా ప్రేమించిందా?

గుండె కలుక్కుమంది!

ఎన్నడూ ప్రేమించదు. ఎవరిని? నన్నా? ఇంకెవరినన్నా నా?

క్రిందటి సంవత్సరం ఒకసారి గుంటూరు వెళ్ళాను. సంధ్య చదువుకుంటున్నది.

"ఏమిటి అంత దీక్షగా చదువుతున్నావ్?" అన్నాను.

"ఎలక్ట్రిసిటీ."

తమాషాకు అందులో ఒక ప్రశ్న అడిగాను. సమాధానంలేదు.

"మరి ఇందాకటినుంచి ఏం చదివావు?"

"ఊరికే చదివేం ప్రయోజనం?"

"మరి—?"

"మనసుండొద్దూ?"

"ఏమయింది?"

"తమకు తెలియదూ?"

"నాకేం తెలుస్తుంది?"

"ఔనుపాపం! వస్తువేమయిందీ దొంగకేం తెలుస్తుంది?"

సంధ్య ఆనాడు నాటకమాడిందా?-

లేక-ఈనాడు ఆ హృదయం మారిందా?

ఏమయినా విచిత్రమైనవాళ్లు ఆడవాళ్ళు.

నాటకమాడిందీ అనుకుంటే నోటితో పొగుడుతూ నొసటితో వెక్కిరించిందన్న మాట. హృదయం మారిందీ అనుకుంటే— "క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్" అన్న సూక్తి నూటికి నూరుపాళ్ళు నిజమన్న మాట.

ఇదే అనేక కథానికల్లో చూపించాను. ఈ విషయంలోనే సంధ్యకూ, నాకూ తీవ్రమయిన వాగ్వివాదాలు అనేకసారు జరిగినయ్. మనసులు మార్చుకుండే విషయంలో అవసరం తప్పితే ఆడా-మగా భేదం లేదంటుంది సంధ్య. అవసరం ఎంత ఒత్తిడిచేసినా ఆడవాళ్ళలాగా మగవాళ్ళు మనసు మార్చుకోలేరు. ఆ విషయానికివస్తే-ఒత్తిడి లేకపోయినా ఆడవాళ్ళు మనసు (చీర మార్చినట్లు) మార్చుకుంటారు. వాళ్లదేహాలెంతసుకుమారమో, వాళ్ల మనసులు అంతకు వేయిరెట్లు సున్నితమంటాను నేను. ఈచర్చ ఒకసారి శిఖరాగ్రాలకికూడా వెళ్లింది. నీవెంత అంటే నీవెంత?-దాకా వచ్చింది. చేతులు చేతులు కలవడానికి మాయదారి నాగరికత, సభ్యత అనేవి అడ్డు నిలిచినయ్, రాతిగోడల్లా.

ఈ అభిప్రాయభేదమే ఇప్పుడు మనసు మార్చుకోవడానికి కారణమయిందా? చిగురుటాకు చలించడానికి ఎంత గాలి కావాలి?

అభిప్రాయభేదాలమాట వస్తే-ఇదే ఏం, ఇంకా చాలా ఉన్నాయి?

ఉన్నందువల్ల వివాహానికొటంకమేమీ లేదని అనుకునేగా నాన్నకు, మామయ్యకు 'సరే'నని సమాధానం ఇచ్చింది. మరింతలోనే ఏం లోకగతి మారింది?

రష్యా అమెరికాలు నిర్మించిన "బాలచంద్రు"లూ, ఇంగ్లాండు సృష్టించిన 'బాలభానుడూ'—వైజ్ఞానికరంగంలో చెప్పుకోదగ మార్పులు తెచ్చినట్లుగా వైవాహిక విషయాల్లోకూడా కొత్తవిలువలేమయినా నిర్ణయించాయా?...

"అయ్యగారూ ఏసొచ్చావండీ—"

"ఏమిట్రా?"

"శుభలేఖలండీ. అదేటండిఅట్టగంటారు? తమరేగదా ఇత్తిరి."

ఔను. ఇంతలోనే మర్చిపోయానేమిటి? ఇందాకనేగా అన్నింటిమీదా అడ్రసులు




## ★ నీలి నీడలు ★

వ్రాసి బిళ్ళలంటించి పోస్టుచేసిరమ్మని ఎల్లమంద కిచ్చింది.

అప్పుడే శుభలేఖలు కూడా పోసయినయ్. రేపిపాటికి దేశం నలుమూలలా రెక్కలు గట్టుకు వాలుతియ్. ఈ పెంగారేపో, ఇప్పుడు తాపీగా—గొప్ప మలుపుట; ఉదారహృదయంట, 'ఊ' అనాలిట...హరి భగవాన్! ఏం అగ్నిపరీక్ష పెటావురా!

సంధ్య దూరంకావడమే - దేహాన్నుండి ప్రాణం వేరు చేయటం, విజ్ఞానశాస్త్రం శాఖోపశాఖలుగా విస్తరించింది. కాబట్టి ఎలాగో కృత్రిమప్రాణ ప్రతిష్ఠ అయినా చేయవచ్చు. కాని ఈ అవమాన భారం మోయడం ఎలా? ఈ శుభలేఖలందుకుని బంధుమిత్రు లందరూ తమ తమ బంధుమిత్ర పరివారంగా వేం చేయరూ? వీళ్ళందరకూ 'రావద్ద'ని ఉత్తరాలు వ్రాస్తే...ముందు శుభలేఖలు చేరి, తర్వాత ఉత్తరాలు చేరినా - వాళ్ళురాకపోవచ్చును, కాని - చెడిపోయిన పెళ్ళి అంటారు కారణాలు రకరకాలుగా ఊహిస్తారు. చిలవలు పలవలు పెంచుతారు. లేనిపోనివన్నీ కల్పిస్తారు - అంతదాకా ఎందుకు? ఇవ్వాళేగా వాటిని పోస్ట్ చేసింది. ఆ పోస్టుమాస్టరును బతిమిలాడో భంగుడో శుభలేఖలు ఊరుదాటకుండా చేస్తే - ఎలా ఆయన కసలు పరిస్థితి నచ్చచెప్పడం?

"ఎల్లమందా?" నాన్నగారికేక.

"అయ్యా!"

"రంగయ్యసెట్టి నేతిడబ్బాలు ఇవ్వాళ వస్తయ్ - అన్నాడు. వెళ్ళివద్దామురా..."

"ఇయ్యాలే తెద్దామా అయ్యగారూ?"

"అహా(! ఇవాళ మాని, రేపు తెద్దాం."

"అంతే చెయ్యండి. నాన్నగారూ."

"వాడికెక్కిన పిచ్చే నీకూ ఎక్కిందేరా? ఎక్కడికక్కడమానుతూ ఉంటే ఇంకా పనులెప్పుడవుతయ్? ఇవ్వాళ కోమటింట్లో సరుకులన్నీ పట్టించుకురావాలి."

హే భగవాన్! - మధ్యలో భగవంతుడేం చేశాడు? - సంధ్యా! ఎంతపరీక్ష పెట్టావు?! నాన్నా సరుకలన్నీ తెస్తే వృధాయేగదా! బూడిదలో పోసిన పన్నీరు కాదా? వద్దందామా - ఏమని చెప్పడం??

నాన్నగారూ, ఎల్లమందా అటు వెళ్లారు. భద్రయ్య ఇటువచ్చాడు.

"రామనాథంగారూ!"

"ఏం భద్రయ్యా! నెక్లేసు చేసుకు వచ్చావా?" అమ్మ ఇంటోనుంచే అడిగింది

"తెచ్చానండి. ఇదిగో చూడండి."

భద్రయ్య పెట్టె తెరిచాడు. నల్లని మొఖమల్ గుడ్డ బాక్ గ్రౌండుగా ఉందో ఏమో తళుక్కుమంది రాళ్ల నెక్లేసు ఆ ఒక్క నెక్లేసు పదిహేనువందల రూపాయలు. అంత డబ్బుపెట్టి ఒక్క నెక్లేసు ససేమిరా వద్దన్నాను. అమ్మ వింటేగా? తన కోడలుకు ఆమాత్రం వస్తువు పెట్టుకోక పోవడం తన ప్రతిష్ఠకూ, తన మర్యాదకూ లోపమట. అదీగాక ఆ నెక్లేసు సంధ్య మెడకు అందమట. ఆ నెక్లేసుకు సంధ్య మెడ అందమట. ఇహ, ఇప్పుడీ నెక్లేసు ఏం చేస్తుందో అమ్మ! చెప్తేవింటేగా! ఎవరికి ప్రాప్తమున్నదో? ఏ కంఠాన్ని కౌగిలించుకుంటుందో? ఒకళ్ళకని చేయిస్తే, ఇంకొకళ్ళకు దక్కుతున్నది. ఎంత వింత! సైన్సు ఎంత డెవలప్ అయినా ముందుజ్ఞానం గురించి కించిత్ కూడా తెల్సుకోలేకపోతున్నాం గదా; ఆ నెక్లేసు అందచందాలకు, కొత్తదనానికి, పనితనానికి అమ్మ మురిసిపోతున్నది గాని కలగబోతున్న విపరిణామం తెలియదు గదా! తెలిస్తే...ఏమౌతుంది.

"ఆ మిగిలిన బంగారంతో-భద్రయ్యా!- మంగళసూత్రమూ, మా రాధగోల చేస్తున్నది ఒక ఉంగరమూ చేసి పెట్టు."

అమ్మ ఇంకా ముందుకుపోతున్నది.

మంగళసూత్రం!!

నాన్నగారు నేతి డబ్బాలకోసం, సరుకుల కోసం పోయినారు. రేపటినుంచే పిండివంటలు ప్రారంభించేస్తారుట. అమ్మ నెక్లేసు చేయించింది. మంగళసూత్రం చేయిస్తున్నది. ఇవన్నీ ఏం చేసేటట్టు?

అమ్మకూ, నాన్నగారికీ చెప్పేస్తే...ఏమని చెప్పేట్టు?!

సంధ్యమీద ఇంత అని చెప్పలేని కోపం


మనోహరమైన కేశములకు
సులభమైన కిటుకు

తాతావారి
'సుగంధిత కొబ్బరి
తలనూనె
మరియు
షాంపూ



ది తాతా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్.

వచ్చింది. ఎదుటగా ఉంటే గొంతు నులిమే వాడినేమో! నా కోపం నాలో నమసి పోవాల్సిందే—

సంధ్యా! ఎంత పని చేశావు? ఎంతఅన్యాయానికి ఒడిగట్టావు? నేనేం దుర్మార్గం చేశాను నీకు! నన్నెందుకిలా పరీక్షిస్తున్నావు? ఇలా వేధిస్తున్నావ్?-నాకు తెలియకుండా నే కళ్ళు చెమ్మగిలినయ్.

మరీ ఇంత బలహీనుడినే?!

లేని ధైర్యం పుంజుకున్నాను. రానికోపం కుంజుకున్నాయ్. పళ్ళుపటపటమన్నాయ్. కళ్ళు ఎఱ్ఱబడ్డయ్. "సంధ్యా! ఈ అవమానానికి వెయ్యింతలుగా నిన్నవమానపఱచకపోతే నేను..."

ఛ,ఛ...సంధ్యేం తప్పుచేసింది? నేనే, చేయని తప్పును నిందిస్తే...పగబట్టితే... ఎలా? ఆడదాని మనస్సే అంత! ఒక్క సంధ్యను అని ఏం ప్రయోజనం? ఎక్కడ ఆడంబరమూ, ఆకర్షణా ఉంటే- బెల్లమున్న చోటే ఈగ వాలినటుగా-అక్కడికే స్త్రీ హృదయం ప్రవహిస్తుంది. అంతకు ముందు బాగ్దానాలూ, వలపులూ ఇట్టే ఆవిరి అయి పోతయ్!

...సంధ్యా, నేను పిక్చర్‌కు వెళ్ళాం. అక్కడ ఒకతను కలిశాడు. మనిషి అందంగాను, ఆడంబరంగానూ ఉన్నాడు. "ఇతడు నా క్లాసుమేటు, కృష్ణమోహన్-మంచి స్పోర్ట్స్‌మన్. ముఖ్యంగా సహృదయుడు, స్నేహపాత్రుడు..." అని ఏవేవో విశేషణాలతో పరిచయం చేసింది సంధ్య. అతను చిరునవ్వునవ్వుతూ చేయి అందించాడు. కాని నా కిప్పుడు అనిపిస్తున్నది-ఆ చిరునవ్వు వెనుక ఏదో ఈర్ష్య దోబూచులాడినట్లు. నిజంగా నా అంత మూర్ఖుడు ఈ లోకంలో లేడు. "ఉదార హృదయుడు, విశాల హృదయుడు" అనే సంధ్య పొగడ్తలకు ఉబ్బిపోయి ఆదర్శవాదినై పోయాను. కాని అనాడే సంధ్యను మందలించి ఉంటే ఈనాడు ఇంతవరకూ వచ్చేది కాదేమో! నాకీ పరీక్ష దాపురించేదా?

సందేహంలేదు; సంధ్య మనసు ఆ కృష్ణమోహన్ మీదికే పోయి వుంటుంది. అందుకే నేను ఆడదాని మనసు నీరు వంటిది అన్నాను. నీరు పల్లానికే ప్రవహిస్తుంది. ఆకృష్ణమోహన్ పట్టికబుర్ల రాయుడు లాగా ఉన్నాడు. కాని సంధ్య ఆ కబుర్ల వలలో పడడమే నాకు వింతగా వుంది. ఆడవాళ్ళ తరఫున వకాల్తా పుచ్చుకునే సంధ్య—ఈసారి కనిపిస్తే ఇక తల ఎత్తకుండా చీవాట్లు పెట్టాలి...అనుభవం లేని విషయాలగురించి వాదించవద్దని.

రాధ వేలు కొలత తీసుకుని భద్రయ్య వెళ్ళిపోయాడు. నాబాధలో నేనున్నాను.

సాయంత్రమయింది.

బరువెక్కిన గుండెలతో—మొహం కడుక్కొని రాకెట్ తీసుకుని క్లబ్బుకు నడిచాను.

ఎన్నడూ తప్పని ప్రతి సర్వీసూ ఈనాడు ఔట్! ఎటెంప్ట్ చేసిన ప్రతి బంతీ మిస్సయింది!

"చాలా పరధ్యానంగా ఉన్నావు భాస్కరం! మనసు బాగా లేదా? లేక ఒంట్లో బాగా లేదా?" పార్ట్నర్ అడిగాడు.

"రెండూనూ" అంటూ వచ్చి కుర్చీలో కూర్చున్నాను. నా స్థానంలోకి ఇంకొకరిని రమ్మంటూ.

కాసేపు కూర్చుని లేచి ఇంటికి వచ్చాను.

బజారుకు వెళ్ళి—సంధ్యకు, బంధువులకూ పెట్టాల్సిన బట్టలు తెచ్చినట్లున్నారు అమ్మ, నాన్న. సంధ్యకు తెచ్చిన పట్టుచీరలు వయిన వయినంగా చూపిస్తున్నది అమ్మ—ఇరుగుపొరుగు అమ్మలక్కలకు. ఎంత పిచ్చిది అమ్మ! అహా! అమ్మ కెలా తెలుస్తుంది ఈ నాటకం?

గదిలోకి వెళ్ళి రాకెట్ వంకకు తగిలించాను.

ఇంటి గోడలకు, గడపలకు, తలుపులకు రంగులు వేస్తున్నారు. అంతా హడావుడిగా ఉంది. పొద్దుటివరకు ఈ వస్తువులన్నీ చూస్తూ ఏవేవో సుందర స్వప్నాలు కన్నాను.

కాని—ఇప్పుడు ఆ వాతావరణమే ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ముళ్ళ మీద నిల్చున్నట్లున్నది. గబగబా బయటకు నడిచాను.

బజారుకెళ్ళి కాఫీ త్రాగి...పిక్చర్‌కు బయల్దేరాను.

పిక్చర్ సాగుతున్నది. మనసులో ఆలోచనలు కండిరీగల్లాగా రేగుతున్నయ్. ఈ విషయం లోగడే తేల్చెయ్యకూడదూ?— తీరా లగ్నం దగ్గఱలో పడ్డ తర్వాత కాకపోతే. అసలు ఆనాడయినా తన్నేమయినా బలవంతం చేశానా? నీవు లేనిదే నా జీవితం ఎడారి అనిగానీ, పితభూమి అనిగానీ మొరపెట్టుకున్నానా? అనాడే తనమనసు బయటపెట్టి ఉంటే- ఎంత సంతోషించేవాడిని!

ఇంతకీ ఇదంతా ఇద్దరిబ్రతుకులూ నవ్వులపాలూ, నాపరాళ్ళ పాలూ కావడానికి వచ్చినట్లుంది.

ఛీ! వెధవబ్రతుకు!- చిత్రహింస అని






## జింజర్ ఐస్ క్రీమ్ చేయు క్రొత్త విధానము

¼ ఔన్సు బ్రౌన్ అండ్ పాల్సన్ కస్టర్డ్ పౌడర్, 8 ఔన్సుల చక్కెర 1 చెంచాడు జింజర్ ఎస్సెన్సు. 1 పైంటు తాజా పాలు, గిలకొట్టిన 2 కోడిగుడ్ల జెన, 4 ఔన్సుల నిలవుంచబడిన అల్లము. కొంచెం పాలలో కస్టర్డ్ పౌడర్‌ను కరిగి పోవునట్లు కలిపి, ఉడకబెట్టి, జెనలో కలుపబడిన కస్టర్డ్ పౌడర్, నిలవుంచబడిన అల్లము (సన్న ముక్కలుగా కోసినది) జింజర్ ఎస్సెన్సు, 2 పెద్దచెంచాల జింజర్ సిరప్, దానిలో వేసి చిలకవలెను. దానిని పొయ్యి మీదుంచి ఆకూడిక చిక్కబడు వరకూ కలుపుచుండవలెను. తరువాత క్రింద దింపి వుంచి మరికొంచెంసేపు కలుప వలెను. అది చల్లారినతరువాత ఫ్రీజు చేయవలెను అనగా ఐస్ క్రీము మిక్సరులోగాని లేక ఫ్రిజిడేరు లోగాని పెట్టి ఐస్ క్రీము తయారు చేయవలెను.

### ఆరోగ్యమునకు సులభ సాధనం

పిల్లలందరూ మీగడవంటి, రుచియైన, ఆరోగ్యకరమగు కస్టర్డును ఇష్ట పడుదురు. అది ఆరోగ్యమును గలిగించు పాలతో నిండియున్నది. బ్రౌన్ అండ్ పాల్సన్ కస్టర్డ్ పౌడర్ శుద్ధమైన కాయగూరలనుండి తయారుచేయ బడినట్టిది అని జ్ఞాపకముంచుకోండి. మీరు సరకులను కొనుటకు బజారుకు వెళ్లినప్పుడు, బ్రౌన్ అండ్ పాల్సన్‌చే తయారుచేయబడిన ఇతర రకముల పదారములైన — రైస్లీ, పేటెంట్ కార్న్‌ఫ్లవర్, బ్లమాంజ్ కోసం చూడండి.




**ఉచిత** ఉల్లాసకరమైన క్రొత్త ఫలహారముల పుస్తకము కోసం దిగువ ఫారమ్‌ను పూరించి పంపండి.

ఆంగ్ల, భాషలోనున్న మీ ఉచిత ఫలహారముల పుస్తకమును దయచేసి నాకు పంపుడు.

నా పేరు.............................................................

నా చిరునామా .....................................................

.......................................................................

తపాలాఖర్చుల నిమిత్తం 15 నయాపైసల తపాలాబిళ్లలను నేను ఇందుతో జతపర్చియున్నాను

డిపార్టుమెంట్ APW.5 కార్న్ ప్రాడక్ట్స్ కొ. (ఇండియా) ప్రైవేట్ లి.
పోస్టు బాక్స్ నం. 994 బొంబాయి—1

కార్న్ ప్రాడక్ట్స్ కొ. (ఇండియా) ప్రయివేట్ లి.

ఏజెంట్లు : పారీ అండ్ కొ. లిమిటెడ్.


# నీలి నీడలు

పిస్తున్నది. ఇంతకంటే ఒకసారి చావడం గాని, చంపబడ్డంగాని ఎన్నో రెట్లు నయం!

ఇంటర్వెల్ అయిందికాబోలు హాల్లో లైట్లు వెలిగాయి. సినిమాదారి సినిమాది! నాదారి నాది. రూపాయిన్నర దండుగ. ఈ బాధ ఇంటి దగ్గరపడకూడదూ? నరము లు పీక్కుపోతూ ఈ నలుల కుర్చీలో ఎందుకు— అని సగంలోనే లేచివచ్చాను.

అన్నం తిన్నాననిపించి చెయ్యి కడుక్కుంటుంటే—

"మధ్యాహ్నం నుంచి అలా ఉన్నావేంరా?"— అమ్మ కనిపెట్టింది.

"ఎలా ఉన్నాను? నీకెప్పుడు అలాగే ఉంటాలే!" అంటూనే పడకగదిలో దూరాను.

ఆలోచనల కవకాశం లేకుండానే నిద్ర పట్టింది. పగలల్లా ఆలోచనలతోనే బుఱ్ఱ దిమ్మెక్కిపోయిందా యె!

తెల్లగా తెల్లవారిన తర్వాత మెలకువ వచ్చింది.

రాత్రివచ్చిన కలలు ఒక్కటొక్కటే జ్ఞాపకం వస్తున్నాయి. చిత్రం! అన్నీ తియ్యటి కలలూ, శుభశూచకమైన కలలూ. అందుకే కలలకు విలువలేదంటాను—

కష్టాల వరదలోపడి కొట్టుకుపోతున్నప్పుడు, ఆనంద విహాయసంలో వలపుగీతాలు పాడుకుంటూ విహరిస్తున్నట్లూ... సంతోష సాగరంలో సుఖాల నావలపై వినోదంగా విహరించేటప్పుడేమో -- కష్టాల నింగిలో రెక్క తెగిన పక్షిలా, దారం తెగిన గాలి పడగలా సుడిగాలిలో కొట్టుకున్నట్లు— కలలు వస్తయ్.

అసలు లేస్తుండగానే-గుండె కలుక్కుమంది. ఇవ్వాళే నా జీవనరాగంలో అపశ్రుతి పలుకుతుంది. నా బ్రతుకును వెలిగించిన దీపం ఇంకోచోటికి వెళ్ళుతుంది. తప్పదు. అంతవరకు తథ్యము. కాని దానికి కారణ మేమిటి? హేతు వెవరు? నాలోని లోపమా? లేక సంధ్యలోని బలహీనతా? మరొకరి ఆకర్షణా?

దానికోసమే నిన్నల్లా తల బద్దలు చేసు కున్నాను.

తల బద్దలయిందిగాని జవాబురాలేదు.

నిన్న చేసినపనే ఇవ్వాళ చేయడం నా పద్ధతికాదు. గుండె రాయిచేసుకుని, పడ బోయే పిడుగుకోసం -- నా జీవితగమనాన్నే మార్చివేసే పిడుగుకోసం -- ఎదురుచూశాను. క్షణక్షణానికి గుండె బరువెక్కుతూ ఉన్నది. ఉండుండి ఏదో జ్ఞాపకం వచ్చి

(56- వ పేజీ చూడండి)

# నీలినీడలు

(10-వ పేజీ తరువాయి)

గుండె దడదడ లాడుతున్నది.

కాలం బరువుగానయినా ముందుకు సాగక తప్పదు. సాగుతోంది.

"ఇంకా టపా రాలేదేం?"

సూర్యుడు నడినెత్తిమీది కొచ్చాడని పెద్దముల్లు చిన్నముల్లు చెవిలో గుసగుస లాడుతున్నది.

ఒకక్షణం సంధ్యమీద కోపంతో మండి పోతాను.

ఒకక్షణం కృష్ణమోహన్‌మీద ఈర్ష్యతో కుంచించుకుపోతాను.

ఒకక్షణం నా మీద నాకే కోపమో, విచారమో, అసహ్యమో తెలియని పరి స్థితిలో ఊగులాడుతాను.

సంధ్యమీద ఎలా కసి తీర్చుకోవడం? ఎలా పగ సాధించడం? తల్చుకుంటే జన్మ జన్మాలకు మరచిపోలేని అపకారం చేయ గలను. ఆ దెబ్బతో వచ్చి కాళ్లమీద వాలదూ?

"పోస్ట్ సార్!"

గుండె లింత వేగంగా ఇంతకుముం దెప్పుడూ కొట్టుకోలేదు! అసలు ఇంత వేగంగా కొట్టుకుంటాయ్ అనికూడా తెలియదు.

పోస్ట్‌మాన్ ఏవో నాలుగయిదు ఉత్త రాలు ఇచ్చాడు. అందులో నా క్కావ ల్సింది ఏరుకోవడానికి క్షణమయినా పట్టలేదు.

కవరు చించి చదవడానికి చేతులు గజగజ లాడినయ్. ఆనర్సు రిజల్ట్ చూసుకుంటే నాడయినా నా చేతులిలా వణికిపోలేదు.

కవరు చాలా తేలికగా ఉంది. వివరంగా, విపులంగా...ఎన్నో తావులుంటాయ్ అను కున్నాను. నా పిచ్చిగాని తేల్చి చెప్పటానికి ఎన్ని ముక్కలు కావాలి.

కవరు చించాను.

ఒకేఒక వాక్యం.

నమ్మలేక ఆ వాక్యమే పదిసార్లు చదువు కున్నాను.

ఎంతపని చేసింది సంధ్య? ఎంతటి దారుణక్రియకు పాల్పడింది? ఇలా చేస్తుం దని ఊహామాత్రమయినా కల్గిఉంటే నిన్నటి నుంచి ఇంతిగా 'చిత్రహింస' అనుభవించే వాడినా?!

ఆడవాళ్ళు ఎంతకయినా తగుదురు! అందులో సంధ్య—చదుకున్న సంధ్య— జీవితంతో సర్దాగా ఆడుకుంది. అంటే ఆశ్చర్యపోకూడదేమో!

భ్రాంతిలో పడలేదుగదా అనుకుని కళ్ళు తుడుచుకుని మళ్ళీ చదువుకున్నాను ఆ వాక్యం.

"ఏప్రిల్ ఫూల్ అయిన బావగారికి నా హృదయపూర్వక క్షమార్పణ - మీ సంధ్య."

అంతస్సీమల్లో పలుచుకున్న నీలి నడల తరిమిగొట్టి పున్నమవెన్నెల విసిరింది! ★




మీకు అవసరమైన..
ఆంధ్ర మెట్రిక్యులేషన్.
ప్రీయూనివర్శిటీ, బిఏ, బిఎస్‌సి,
లా అండ్ లిటరేచర్ పుస్తక
ములకు మాకు వ్రాయండి.
వైజాగ్ బుక్ హౌస్, వైజాగ్




Printed and Published for Nageswara [illegible] Estates (Private) Ltd., by S. Radha Krishna [illegible] Patrika Press, [illegible] & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad